క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సాయికృష్ణ


చోడే సాయికృష్ణ

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా మండపేట పట్టణానికి చెందిన చోడే సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకాన్ని ప్రకటించింది. దీర్ఘ కాలంగా సాయికృష్ణ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడంతో నియోజకవర్గ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు సాయికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు


విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం (మండపేట): ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి రిలయన్స్ క్విజ్ పోటీల్లో మండపేట పట్టణంలోని గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని ఎస్.పావనిదుర్గ, నైన్త్ విద్యార్థిని ఎస్.దీక్షిత మొదటి స్థానంలో నిలిచారు. వీరికి రూ.50 వేలు విలువైన ల్యాప్‌టాప్‌లను అందించారు. గురువారం తన కార్యాలయంలో వీరిని ఎమ్మెల్యే అభినందించారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

కపిలేశ్వరపురం (మండపేట): గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె కొనసాగుతుందని, వారికి తమ మద్దతు ఉంటుందని తపాలా ఉద్యోగ సంఘ నాయకులు కొండపల్లి సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని సబ్ పోస్టాఫీస్ వద్ద గురువారం గ్రామీణ తపాలా ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్‌పీఈజీడీఎస్ కార్యదర్శి ఎండీఎం షరీఫ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పోస్ట్‌మన్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి కె.ఈశ్వరరావు, జి.వెంకట్రావు, వి.గోవింద్, ఎం.అనూష, ఎస్.దుర్గాదేవి, కె.అనూష పాల్గొన్నారు.

తాపేశ్వరం హైస్కూల్‌లో వన భోజనాలు


తాపేశ్వరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం తాపేశ్వరంలోని పోలిశెట్టి సత్తిరాజు, భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యావనభోజన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల భవన దాత సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరమూరుకు చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆటపాటలతో అలరించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి ఆభరణాల సమర్పణ


ఆలయంలో ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దాతలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వేంచేసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గురువారం ఆలయ ధర్మకర్త సామంచి సత్యనారాయణమూర్తి-వెంకట మహాలక్ష్మి దంపతులు 9 కేజీల వెండితో తయారు చేయించిన ఆభరణాలను సమర్పించారు. ముందుగా ఆలయంలో ఉండి వీరభద్ర శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆభరణాలను స్వామివారికి, అమ్మవార్లకు అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి భద్రరావు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 20న పోలిపల్లిలో నిర్వహించనున్న ఎన్నికల శంఖారావం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఒక్క టీ చాలు

- టీ, కాఫీలకు అమితమైన ఆదరణ
- విస్తారంగా ఉపాధి అవకాశాలు
- నేడు అంతర్జాతీయ తేనీరు దినోత్సవం

కపిలేశ్వరపురం: ప్రపంచ వ్యాప్తంగా టీ ఉత్పత్తుల వ్యాపార సరళికి, తేయాకు రైతులు, కూలీల జీవన స్థితిగతులు, టీ సంబంధిత సామాజికాంశాలకు ప్రాధాన్యమిస్తూ.. 2005 నుంచి ఏటా డిసెంబర్ 15న అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని జరుపుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలోనూ టీ దుకాణాలుండగా, వీటిలో కొన్ని మంచి గుర్తింపు కలిగి ఉన్నాయి.

నియోజకవర్గంలో 120 గ్రామాల పరిధిలో 1,49,856 కుటుంబాలున్నాయి. వీటికి తోడు మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో కుటుంబాలు విస్తారంగా ఉన్నాయి. కుటుంబంలో కనీసం ఇద్దరికి టీ తాగే అలవాటున్నా, రోజుకోసారి టీ తాగినా.. 2,99,712 టీలు తాగినట్టవుతుంది. రోజుకోసారి మాత్రమే కాకుండా, రెండు మూడు సార్లు సేవించే అలవాటున్నా ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. టీ, కాఫీపొడుల విక్రయ దుకాణాల ద్వారా అనేకమంది ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హోటళ్ల ద్వారా టీ వినియోగం అధికమైంది.

జీవ రసాయనాలివీ..

టీలో యాంటీ ఆక్సిడెంట్స్ అయిన కాటేచిన్స్, ఫ్లేవనాయిడ్స్, ఫ్లేవనోన్స్ అనే జీవ రసాయనాలుంటాయి. ఫ్లేవనాయిడ్స్ మన శరీరంలోని హానికర కొలెస్ట్రాల్ ఎల్‌డీఎల్‌ను తగ్గిస్తాయి. కాఫీలో కెఫిన్, డైటర్‌పిన్స్, డైఫినాల్స్ తదితర ఉత్ప్రేరక జీవ రసాయనాలుంటాయి. కాఫీలో మైగ్రేన్ తలనొప్పిని తగ్గించే యాంటీ మైగ్రేన్ ఔషధం ఉంటుంది. మానసిక ఉత్తేజం కలిగించడమే కాకుండా, శరీరంలోని కొవ్వును కొంతమేర నిరోధిస్తుంది. కాఫీలోని డైఫినాల్ అనే యాంటీ ఆక్సిడెంట్ పక్షవాతాన్ని నివారిస్తుంది. అనుబంధంగా వాడే యాలకులు, తాటిబెల్లం, పంచదార, తేనె, నిమ్మరసం, దాల్చిన చెక్క, బాదం, కుంకుమ పువ్వుల్లో ఆరోగ్య విలువలున్నాయి.

అతిగా సేవిస్తే అనర్థమే..

వైట్ టీ, బ్లాక్ టీ, గ్రీన్ టీ, తులసి టీ, నిమ్మ టీ, అల్లం టీ, పుదీనా టీ, ఫిల్టర్ కాఫీ లేదా డ్రిప్ బ్ర్యూడ్ కాఫీ, అన్‌ఫిల్టర్డ్, బాయిల్డ్ లేదా సాధారణ కాఫీ తదితర రకాలెన్నో ఉన్నాయి. టీని రోజుకు నాలుగు, కాఫీని రోజు రెండు సార్లు మించకుండా తీసుకోవడం ద్వారా సమస్యలకు దూరంగా ఉండొచ్చు. టీ జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలిగించడంతో పాటు పోషకాలు ఒంటికి పట్టకుండా చేస్తుంది. పరగడుపున టీ, కాఫీలకు బదులుగా మంచినీరు తాగడం మంచిది.


అంగరలో టీ తాగుతున్న దృశ్యం

కల్తీని ఇలా గుర్తించవచ్చు...

సేవించే టీ నాణ్యతతో ఉండాలి. టీపొడిని రంపం పొట్టు, జీడిపప్పు పొట్టులతో కల్తీ చేస్తున్నట్టు 2021 డిసెంబర్‌లో బిక్కవోలు మండలంలో పోలీసులు, ఫుడ్ టెస్ట్ అధికారులు గుర్తించారు. టీ పొడి కల్తీ జరిగిందీ, లేనిదీ సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. కొంత టీ పొడిని గాజు గ్లాసులోని నీటిలో వేసినప్పుడు, కల్తీ జరిగితే రంగు కిందకు చేరుతుంది. రంగు దిగలేదంటే కల్తీ జరగలేనట్టుగా గుర్తించాలి.

> **వినియోగదారులు పెరుగుతున్నారు**
>
> 
>
> గ్రామీణ ప్రాంతాల్లో సైతం రుచికర టీని సేవించేందుకు ఇష్టపడుతున్నారు. రకరకాల రుచులతో టీని తయారు చేస్తున్నందున వినియోదారులు రోజురోజుకూ పెరుగుతున్నారు.
>
> – ముత్తా సూర్యనారాయణ, టీ దుకాణదారుడు, అంగర

ప్రజల ముగింటకే ప్రభుత్వ పాలన

కె.గంగవరం: సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని దంగేరులో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడుతూ మనకు మంచి చేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకునే బాధ్యత మనందరిపైనా ఉందని వివరించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. నాడు ఆరోగ్య శ్రీ పెట్టి పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఆయన బాటలోనే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దనే వైద్యం అందించడం జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ ప్రజలకు సంక్షేమ పాలన నూటికి నూరు శాతం అందించారని చెప్పారు. పేదల అభివృద్ధికి కృషి చేసిన జగన్‌ను మళ్లీ రాష్ట్రానికి కావాలని సూచించారు. అనంతరం సచివాలయం వద్ద గ్రామంలో ప్రజలు పొందిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ, ఈఓపీఆర్డీ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


దంగేరులో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

సంక్షేమ పాలన అందిస్తున్న జగన్

రాయవరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. వెంటూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం పూర్తి స్థాయి ప్రగతి సాధించాలన్నా, దేశంలో అగ్రస్థానానికి చేరాలన్నా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు వాసంశెట్టి రాధాకృష్ణ, మండల సచివాలయ కమిటీ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, ఎంఎల్‌వో యు.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందజేస్తున్న వెంకట్రావు, శ్రీనివాసరావు, వెంకటరమణ

మూడోరోజూ కొనసాగిన సమ్మె

రామచంద్రపురం: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ సంఘం తరఫున గ్రామీణ తపాలా ఉద్యోగులకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం బ్రాంచ్ పరిధిలోని 160 మంది ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారని బ్రాంచ్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.స్వర్ణసరాజు, ఎస్వీ మునేశ్వరరావు తెలిపారు. వారు మాట్లాడుతూ తపాలా ఉన్నతాధికారులు తమ వాట్సాప్ గ్రూపులో బెదిరింపులకు పాల్పడడానికి నిరసనగా అన్ని అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి సభ్యులంతా వైదలగాలని పిలుపునిచ్చారు. యూనియన్ కోశాధికారి కామేశ్వరి, నాయకులు పెంకే గణేష్‌కుమార్, వి.వీరయ్య చౌదరి, జి.రామకృష్ణచౌదరి, సీహెచ్ ప్రశాంత్, ఎస్కే వల్లి, ఎం.సూర్యరాయణ తదితరులు సమ్మె ఆవశ్యకతను వివరిస్తూ ప్రసంగించారు.


ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు

కనువిందు చేస్తున్న మంచుదుప్పటి


అముజూరులో ఉదయం 8 గంటలకు కురుస్తున్న మంచు

కె.గంగవరం: తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు గ్రామీణ ప్రాంతాలకు మంచు దుప్పటిలా అల్లుకుంటుంది. గత రెండు రోజులుగా మంచు 9 గంటల వరకు వదలలేదు. దీంతో పచ్చని పంట పొలాల మధ్య, కొబ్బరిచెట్ల మీద ఉన్న మంచు చూడడానికి కనువిందు చేశాయి. ఉదయాన్నే పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు మంచును చూసి కనువిందు చేసే వాతావరణాన్ని ఆస్వాదించారు. అయితే గత నాలుగు రోజులుగా తెల్లవారుజామున మంచు, ఉదయం 10 గంటలు దాటిన తరువాత నాలుగు గంటల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఉదయాన్నే మంచు కురవడం వల్ల వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణాలు చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు.

అన్నదాన భవనానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆత్రేయపురానికి చెందిన వి.దిలీప్ వర్మ రూ.10,116, అమలాపురానికి చెందిన ఎస్.సీతారామరాజు–అన్నపూర్ణ దంపతులు రూ.10 వేలు, గణపవరం మండలం కేశవరానికి చెందిన పి. సన్యాసిరావు రూ.10,001, బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన కె.దుర్గా వీరరాఘవరెడ్డి రూ.10 వేలు, ఆలమూరుకు చెందిన డి.నాగేశ్వరరావు రూ.10,116 విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి చిత్రపటం అందజేశారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు మమత ఎంపిక

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కపిలేశ్వరపురం జెడ్పీ హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థిని కాదా మమత ఎంపికైంది. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మమత ప్రతిభచూపి, ఈ నెల 16 నుంచి న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ గుబ్బల వేణుగోపాలరావు, పీఈటీ వాసంశెట్టి రవికుమార్‌ను అభినందించారు. అలాగే విద్యార్థినిని ప్రోత్సహిస్తూ కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన కొరపాటి జానకిరామయ్య రూ.10 వేలు, కాకినాడ సత్య స్కాన్ ఎండీ కాదా వెంకటరమణ, రూ.5 వేలు, కపిలేశ్వరపురం మండల శెట్టిబలిజ సంఘం రూ.రెండు వేలను ప్రోత్సాహకంగా అందజేసినట్టు హెచ్ఎం తెలిపారు.


మమతను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మినీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నేలటూరులో నూతనంగా నిర్మించిన డా. బీఆర్ అంబేడ్కర్ మినీ కమ్యూనిటీ హాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ రుద్రాక్షుల వీరగౌరీకుమారి, ఉప సర్పంచ్ శనక్కాయల దొరబాబుతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత తోట పృథ్వీరాజ్, స్థానిక నాయకులు కొప్పిశెట్టి కిశోర్, రుద్రాక్షుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


నేలటూరులో మినీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

వీఆర్వోను సస్పెండ్ చేయాలి

అంబాజీపేట: అసభ్య పదజాలంతో మహిళలను అవమానించడమే కాకుండా, కనీస మర్యాద కూడా ఇవ్వలేని ముక్కామల వీఆర్వో డి.పార్థసారథిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని సర్పంచ్ బండారు వెంకటలక్ష్మితో పాటు స్థానిక మహిళా సంఘాలు డిమాండ్ చేశారు. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వీఆర్వో పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ఇంటి యజమానులు ఎవరూ లేని సమయంలో ఎంక్వయిరీ పేరుతో ఇళ్లకు వెళ్లి మహిళలను అగౌరవంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర దరఖాస్తులకు లంచం ఇస్తే గాని పని చేయకుండా కాలయాపన చేస్తూ మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఏ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోనని వ్యంగ్యంగా సమాధానం చెబుతున్నాడన్నారు. మహిళలపై అగౌరవంగా ప్రవర్తిస్తున్న పార్థసారథిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో, ఎస్సై ఎ.చైతన్యకుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బండారు శ్రీదేవి, రాకుర్తి సత్య, పిల్లా వెంకటలక్ష్మి, మరిడి దుర్గ, దాక శ్రీదేవి, మేడేపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించేందుకు చర్యలు

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన పౌష్టికారాన్ని పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. డిమాండ్ల సాధనకై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో గంగలకుర్రు పెదగరువులో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ మహాలక్ష్మి పర్యవేక్షణలో గురువారం తెరిపించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన పౌష్టికాహారం కిట్‌లు, సామగ్రి పాడైపోకుండా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పంపిణీ చేస్తామన్నారు. అందుకు గాను సచివాలయ సిబ్బందిని అంగన్‌వాడీ కేంద్రానికి ఇన్‌చార్జిగా నియమిస్తామన్నారు. కేంద్రంలో ఉన్న వస్తువులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వీఆర్వో వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం మెట్లకాలనీలో సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు చిన్నారుల తల్లిదండ్రులు మద్దతుగా నిలిచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవనీయకుండా అడ్డుకున్నారు.

పంట నష్టం నమోదులో అలసత్వం వద్దు

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న వరి, ఉద్యాన పంటల వివరాల నమోదులో ఎటువంటి అలసత్వం వద్దని నిష్పక్షపాతంగా నమోదు చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పంట నష్టం వాటిల్లిన కె.పెదపూడి, పుల్లేటికుర్రు, ముక్కామల, గంగలకుర్రు తదితర గ్రామాల్లో పంట నష్టంపై జరుగుతున్న సర్వేను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఏ ఒక్కరూ పంట నష్టం నమోదు చేయలేదనే రిమార్కులు లేకుండా సక్రమంగా నమోదు చేయాలన్నాను. పంట నష్టంకు వచ్చిన సర్వే అధికారులకు రైతులు సహకరించాలన్నారు. పూర్తి నష్టం, పాక్షికంగా దెబ్బతిన్న పంట వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ మణికుమార్, వీఆర్వో రమణ, తదితరులు పాల్గొన్నారు.


కె.పెదపూడిలో పంట నష్టం వివరాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మంగతాయారు

16, 17 తేదీల్లో గణిత దినోత్సవం

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఫోరం (ఏపీఎంఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఇదే సందర్భంగా ఏపీఎంఎఫ్ రాష్ట్ర సమావేశాలు కూడా నిర్వహిస్తామన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండల స్థాయి విజేతలకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీల్లో చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. విజేతలు ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే ఏపీఎంఎఫ్ సమావేశాల్లో రాష్ట్ర క్విజ్ పోటీలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి విజేతలను ఏపీఎంఎఫ్ ఉపాధ్యక్షుడు పీవీఎల్ఎన్ శ్రీరామ్, ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలభద్ర సురేష్, కార్యదర్శి మొర్త నాగ సూర్యనారాయణ అభినందించారు.

భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం


ఎంపీడీఓ రాజును సత్కరిస్తున్న దివ్యాంగ విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): దివ్యాంగులకు సమస్త మానవ సమాజం అండగా నిలుస్తుందని, వారిపై ప్రజలు చూపుతున్న ఆదరణే అందుకు నిదర్శనమని దివ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగ దినోత్సవం జరిగింది. ఎంపీడీఓ ఐదం రాజు, ఎంఈఓ సోమి రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రూ.లక్ష వ్యయంతో భవిత కేంద్రానికి గ్రిల్స్, భవనానికి రంగులు వేయించిన దాత ఐ.సత్యనారాయణను ప్రముఖులు సత్కరించారు. ఎంపీడీఓ రాజును భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉదయ్‌శంకర్, సీఆర్పీలు శేషారావు, వెంకటలక్ష్మి, భద్రరావు, ఐఈడీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల నిరసన


ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న బీఎల్వోలు

రామచంద్రపురం: అంబాజీపేట మండలం ముక్కామలలో బీఎల్ఓ అయిన వీఆర్వో పార్థసారథి ఎన్నికల విధులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన మల్లిబాబు అనే వ్యక్తి దాడి చేసిన గాయపర్చిన సంఘటనను నిరసిస్తూ పట్టణంలో బీఎల్‌వోలు, వీఆర్వోలు నిరసన వ్యక్తం చేస్తూ ఆర్డీవో కార్యాలయం వినతిపత్రం అందజేశారు. వీఆర్వోల సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలకు రక్షణ కల్పించాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కపిలేశ్వరపురం (మండపేట): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మండపేట మండలం ఏడిద, పాలతోడు గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో గురువారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పలివెల సుధాకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, నాయకులు వల్లభనేని రవీంద్రబాబు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో జైలు

రావులపాలెం: బైక్ దొంగిలించి వ్యక్తికి ఏడు నెలల జైలు పడినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం గతేడాది డిసెంబరు 16న అరటికాయల మార్కెట్ దగ్గర దాసరి నాగరాజు తన బైక్ మెకానిక్ షెడ్ వద్ద పార్క్ చేసి ఉంచాడు. రాత్రి సమయంలో ఎవరో దొంగిలించుకుపోగా రావులపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు. ఈ కేసులో ఉప్పాడ కొత్తపల్లికి చెందిన బొండపల్లి ఏసుకుమార్‌ను అరెస్టు చేసి బైక్ స్వాధీనం చేసుకొని ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. కోర్టులో నేరం అంగీకరించగా కొత్తపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.భాస్కర రావు ముద్దాయికి 7 నెలలు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో..

రావులపాలెం: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి పది రోజులు జైలు శిక్ష పడినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో స్థానిక హైవేపై బలరామిరెడ్డి జంక్షన్ సెంటర్లో వాహనాల తనిఖీ చేస్తుండగా, సిద్ధాంతం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న ఐషర్ వ్యాన్ డ్రైవర్ రాజమహేంద్రవరం సమీపాన కొంతమూరుకు చెందిన పోసేపు రాజు మద్యం తాగి వ్యాన్ స్పీడ్‌గా ప్రమాదకరంగా నడుపుతున్నట్టు గుర్తించి పట్టుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయగా, కొత్తపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పది రోజులు జైలు శిక్ష విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపినట్టు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు సామూహిక ఆత్మహత్య చేసుకోవడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లువలస గణపతిరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వీరమల్లు శ్రీనివాసులు పోలీసులను కోరారు. మండపేటలోని బీసీ సామాజికవర్గానికి చెందిన కుటుంబంలోని నలుగురు వారణాసిలోని కాటేజీలో ఆత్మహత్య చేసుకున్నారని, మండపేట పట్టణంలో వారు అప్పులపాలైన తీరుపై విచారణ చేపట్టాలంటూ పట్టణ పోలీసులకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు.